


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 103	ఎడిటర్ : డి.శివకృష్ణ	శుక్రవారం	30-10-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 103	EDITOR : D.SHIVAKRISHNA	FRIDAY	30-10-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

అన్నాచెల్లెళ్లే చూపు.. ఆదిలాబాద్ వైపు..!





స్టార్ త్రినేత్రం, ఆదిలాబాద్ :

తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు ఒకే కుటుంబానికి చెందిన నాయకులుగా,ఒకే రాజకీయ పార్టీలో కీలకంగా వ్యవహరించిన కల్వకుంట్ల కవిత, కేటీఆర్ ఇప్పుడు వేర్వేరు రాజకీయ వేదికల ద్వారా ఆదిలాబాద్ జిల్లా ప్రజల ముందుకు రానుండటం ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రక్షణ సేన అధి నేత్రిగా కవిత ఇంద్రవెల్లిలో అక్టోబర్ 30న నిర్వహిం చనున్న పాంచజన్య సభ, నవంబర్ 1న ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న రైతు గర్జన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.కుటుంబ బంధం ఒకవైపు.. వేర్వేరు రాజకీయ వేదికలు మరోవైపు అన్నట్లుగా సాగుతున్న ఈ పరిణామాలు జిల్లాలో చర్చకు దారితీస్తున్నాయి. కొత్త రాజకీయ వేదిక ద్వారా తనదైన ముద్ర వేయాలని కవిత ప్రయత్నిస్తుండగా, రైతాంగ సమస్యలను ప్రధాన అస్త్రం గా చేసుకుని ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. వరునగా రెండు సభలు జరగనుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ సభల ద్వారా నాయకులు ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తారు? స్థానిక సమస్యలపై ఏయే అంశాలను ప్రస్తావి స్తారు? ప్రసంగాలకే పరిమిత మవుతారా.. లేక క్షేత్రస్థాయిలో కార్యాచరణకు దిగుతారా? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఇంద్రవెల్లి వేదికగా కవిత కొత్త అడుగు..

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఇంద్రవెల్లిలో నిర్వహిం చనున్న పాంచజన్య సభపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్త రాజకీయ వేదిక ద్వారా ప్రజల్లోకి వెళ్ల డం, తన ఆలోచనలు, రాజకీయ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణను వివరించేం దుకు ఈ సభను ఉపయోగిం చుకునే అవకాశం ఉంది. ఇంద్రవెల్లికి ఉన్న రాజకీయ, సామాజిక ప్రాధాన్యం నేపథ్యంలో ఇక్కడ నిర్వహించే కార్యక్రమంపై ఆసక్తి నెలకొంది. ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలు, తెలంగాణ రాజకీయాలపై తన వైఖరి, తెలంగాణ రక్షణ సేన భవిష్యత్

(మిగతా 2లో..)

డిజిటల్ అరెస్ట్, సైబర్ మోసాల బాధితులకు బ్యాంకులే పరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు

ఢిల్లీ :



డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల ద్వారా అమాయకుల సొమ్మును దోచుకుంటున్న సైబర్ ముఠాల వల్ల అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల పర్యవేక్షణ, నరియైన తనిఖీలు (డ్యూ డిలిజెన్స్) లోపించడం వల్లే ఈ తరహా మోసాలు జరుగుతున్నాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో.. బ్యాంకింగ్ నిబంధనల వైఫల్యం వల్ల ఖాతాదారులు నష్టపోతే, వారికి సంబంధిత ఆర్థిక సంస్థలే పూర్తి స్థాయిలో పరిహారం అందించేలా నిబంధనలు రూపొందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తుది నిబంధనలు అమల్లోకి తెచ్చేందుకు నోటిఫికేషన్‌ను నవంబర్ 30, 2026 నాటికి విడుదల చేసి, డిసెంబర్ 31, 2026 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ధర్మాసనం సూచించింది.చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. దేశ ఆర్థిక వ్యవస్థపై డిజిటల్ అరెస్టుల పేరిట జరుగుతున్న దాడుల వల్ల ఈ ఏడాదే దాదాపు రూ.800 కోట్ల మేర నికర నష్టం వాటిల్లిందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ప్రతి ప్రతిపాదిత అనుమానాస్పద లావాదేవీని వెంటనే తాత్కాలికంగా నిలిపివేయడం, సంబంధిత సమాచారాన్ని స్వయంచాలకంగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపడం,

(మిగతా 2లో..)

వెనక్కి తగ్గేది లేదు..

నవంబర్ 1న ఇండియా కూటమి నిరసనపై ఖర్గే



ఢిల్లీ :

సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తేలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. నవంబర్ 1వ తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యం అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నా యని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించిన తీరుపై సైతం ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగంగ కలుగుతోందని, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

(మిగతా 2లో..)

కేటీఆర్‌కు కొండా సురేఖ క్షమాపణలు..

బీఆర్ఎస్‌లోకి రీఎంట్రీపై ఊహాగానాలు!



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో తాను చేసిన కొన్ని వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి కొండా సురేఖ స్పందిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ (ట్విట్టర్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. గతంలో రాజకీయ విమర్శల నేపథ్యం లో మాట్లాడిన ఆ వ్యాఖ్యలను మూర్తిగా ఉపసంహరిం చుకుంటున్నట్లుగా ప్రకటిం చారు. అప్పటి రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాలను విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేశానని కొండా సురేఖ స్పష్టం చేశారు. అంతేకానీ కేటీఆర్‌ను కానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వ కంగా బాధపెట్టే ఉద్దేశం లేదా వారి ప్రతిష్టకు భంగం కలిగించే దురుద్దేశం తనకు ఎంత మాత్రం లేదని పేర్కొన్నారు.

పోయిన మంత్రి పదవి.. రేవంత్ సర్కార్‌పై అసంతృప్తి

అయితే, ఇటీవలే కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన విషయం తెలిసిందే. తగిన కారణం చూపకుండా, కనీసం వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తప్పించారని, బీసీ మహిళ కావడం వల్లే తనపై ఈ విధమైన చర్యలు తీసుకున్నారా అంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల అనంతరం కాంగ్రెస్ నాయకత్వంపై కొండా సురేఖ తీవ్ర అసం తృప్తితో ఉన్నారనే వార్తలు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

బీఆర్ఎస్‌లోకి రీ ఎంట్రీ..!

మంత్రి పదవి పోవడంజ.. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై

(మిగతా 2లో..)

పాదయాత్ర ట్యాంక్‌బండ్‌పై కాదు..

అమిత్ షా ఎంట్రీతో ప్లాన్ మార్చిన బీజేపీ!



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

హైదరాబాద్‌లో నవంబర్ 2వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'మహాపాదయాత్ర' ప్రాంతాన్ని మార్చే దిశగా బీజేపీ తీవ్రంగా ఆలోచిస్తోంది. తొలుత ట్యాంక్‌బండ్ ప్రాంగణంలో ఈ పాదయాత్ర చేపట్టాలని భావించినప్పటికీ, భద్రత, ఇతర పరిపాలనాపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని రూట్‌ను మరోచోటుకు మార్చాలని పార్టీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ మహాపాదయాత్రకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపుతోంది. అమిత్ షా పాల్గొంటుండటంతో పాటు భారీ స్థాయిలో జనసమీకరణ జరిగే అవకాశం ఉన్నందున, పాదయాత్ర అనంతరం భారీ బహిరంగ సభను నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది.

(మిగతా 2లో..)

ఎమ్మెల్యే కోమటిరెడ్డి 'కంపెనీ' పిటిషన్..

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ :



హైదరాబాద్ రేడియల్ రోడ్-2 టెండర్ల వివాదంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి చెందిన 'సుశీ ఇన్‌ఫ్రా' కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత నాయస్థానం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ తమ బిడ్‌ను అక్రమంగా తిరస్కరించారని సవాల్ చేస్తూ, ప్రస్తుత టెండర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని అభ్యర్థిస్తూ 'సుశీ ఇన్‌ఫ్రా' సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, టెండర్ల ప్రక్రియ నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరించింది.ఈ వ్యవహారం ఇప్పటికే తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జ్ ముందు విచారణలో ఉన్నందున, అక్కడే ఈ పిటిషన్‌పై ప్రాధాన్యత క్రమంలో విచారణ జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ ప్రాజెక్ట్ టెండర్లను దక్కించుకున్న ఎన్సీసీ , జీకేసీ, బీవీఎస్ఆర్ కంపెనీలను ఈ కేసులో ఇంప్లీడ్ చేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా టెండర్లు దక్కించుకున్న ఆయా మూడు కంపెనీలు రెండు వారాల్లోగా తమ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత మరో వారంలోగా పిటిషనర్ అయిన 'సుశీ ఇన్‌ఫ్రా' కంపెనీ రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. హైకోర్టులోనే ఈ కేసుకు సంబంధించిన విచారణను ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టి వేగంగా తేల్చాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

క్యాన్సర్ బాధితులకు దక్కని ఊరట..

ఆ 37 పేటెంట్ ఔషధాల ధరల్లో నో చేంజ్



ఢిల్లీ :

ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు ఏమాత్రం ఉపశమనం లభించలేదు. అత్యంత ఖరీదైన 37 పేటెంట్ క్యాన్సర్ ఔషధాల ధరల్లో ఎలాంటి తగ్గింపు, మార్పు లేదని తాజాగా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ స్పష్టం చేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సూచించిన ప్పటికీ, ఈ కీలక ఔషధాల ధరలు తగ్గకపోవడం గమనార్హం.

కీమో, ఇమ్యునోథెరపీ మందుల ధరలు యథాతథం..

NPPA వెల్లడించిన వివరాల ప్రకారం.. క్యాన్సర్ చికిత్సలో అత్యంత కీలకమైన కీమోథెరపీ, ఇమ్యునోథెరపీకి వినియోగించే మందుల ధరలు పాత ధరల పద్దే యథా తథంగా కొనసాగను న్నాయి. రోగులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్న లంగ్ క్యాన్సర్ చికిత్సకు వాడే ప్రధాన ఔషధం ధర రూ.4.30 లక్షలుగానే ఉంది. ఇమ్యునోథెరపీలో వాడే కిట్రుడా 100 ఎంజీ ఇంజెక్షన్ ధర రూ.2.16 లక్షలు, ఫెస్గో గ్రుష్టవంస్త్రశీ) ఉమ్మడి డోస్ ధర ఏకంగా రూ.4.93 లక్షలకు విక్రయాలు కొనసాగుతు న్నాయి. అయితే, మొత్తం 543 బ్రాండ్లకు సంబంధించిన క్యాన్సర్(మిగతా 2లో..)

స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/2026/A0436
అనుక్షణం నిక్షేపణం తెలుగు దినపత్రిక

కేటీఆర్‌కు కొండా సురేఖ క్షమాపణలు..

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కడంతో పాటు, సదన్‌గా కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటూ పోస్ట్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తోంది. కొండా సురేఖ, మురళి దంపతులు త్వరలోనే కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి మళ్లీ గులాబీ దళంలోకి చేరుతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కేటీఆర్‌తో ఉన్న చట్టపరమైన, రాజకీయపరమైన విభేదాలను సర్దుబాటు చేసుకునేందుకే ఈ వివరణ ఇచ్చారని, గులాబీ గూటికి చేరేందుకు బాటలు సుగమం చేసుకుంటున్నారని పొలిటికల్ అనలిస్టులు భావిస్తున్నారు. అయితే, కొండా దంపతుల రీఎంట్రీపై గులాబీ బాస్ ఎలా రియాక్ట్ అవుతారనేది ఆసక్తికరంగా మారింది.

వెనక్కి తగ్గేది లేదు..

(మొదటిపేజీ తరువాయి)

అన్ని పార్టీలు తమకు మద్దుతుగా ఉన్నాయని చెప్పారు. మరోవైపు పండుగల సీజన్ లో భారీ ర్యాలీలు నిర్వహించడం వల్ల వ్యాపారాలకు నష్టం జరుగుతోందని వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ర్యాలీ తేదీని మార్చాలని కోరారు. పెద్ద ఎత్తున ప్రజలు రావడం వల్ల వ్యాపారం దెబ్బ తింటుందని, తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కాగా వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నా ఖర్గే నిరసన కొనసాగుతుందని చెప్పడం ఆసక్తికరం.

క్యాన్సర్ బాధితులకు దక్కని ఊరట..

(మొదటిపేజీ తరువాయి)

మందుల సమగ్ర ధరల జాబితాను చ్రీూూా అధికారికంగా విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన కొత్త గరిష్ట రిటైల్ ధరలు రాబోయే నవంబర్ 9 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. అత్యంత ఖరీదైన ఈ పేటెంట్ మందులపై ధరల పరిమితి విధిస్తారని ఆశించిన రోగులకు, వారి కుటుంబాలకు ఈ నిర్ణయం తీవ్ర నిరాశను కలిగించింది.

పాదయాత్ర ట్యాంక్‌బండ్‌పై కాదు..

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భాగంగా బహిరంగ సభ నిర్వహణకు అనువైన ప్రాంతంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను బీజేపీ కీలక నేతలు పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా బీజేపీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్, విపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లేందుకు ఈ యాత్ర ద్వారా సమరశంఖం పూరించాలని బీజేపీ నిర్ణయించింది.

డిజిటల్ అరెస్ట్, సైబర్ మోసాల బాధితులకు బ్యాంకులే పరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం భౌతిక తనిఖీ ద్వారా నిజా నిజాలు నిర్ధారించడం వంటి ముందస్తు జాగ్రత్తలు ప్రతి ఆర్థిక సంస్థకూ నిర్బంధం చేయాలని కోర్టు పేర్కొంది. అలాగే నిబంధనలు ఉల్లంఘించే అధికారులతో పాటు మొత్తం బ్యాంకింగ్ సంస్థపైనే 'స్టిక్ట్ లయబిలిటీ' మోపాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిన "మ్యూల్ ఖాతాలను" (బోగస్ అకౌంట్లను) అరికట్టడంపై ఆర్‌బీఐ ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే సైబర్ నేరాల్లో భాగస్వామ్యమున్న ఉద్యోగులపై బ్యాంకులు తీసుకున్న చర్యల వివరాలను తదుపరి విచారణ నాటికి సమర్పించాలని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణిని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ స్పందిస్తూ.. తప్పుడు ఏజెన్సీలు, అధికారుల పేరిట వచ్చే సందేశాలను గుర్తించే సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వాట్సాప్, ఇతర వేదికలకు సంబంధించి సుమారు 9,400 ఖాతాలను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ సేవలను మరింత వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు.గతంలో హర్యానాకు చెందిన ఒక వృద్ధ దంపతులను సీబీఐ, ఈడీ అధికారుల పేరుతో బెదిరించి, సుప్రీంకోర్టు నకిలీ ఉత్తర్వులను చూపించి రూ. 1.05 కోట్లకు పైగా కాజేసిన ఘటనపై కోర్టు సుమోటోగా విచారణ స్వీకరించిన సంగతి తెలిసిందే. ఫోన్ల ద్వారా అరెస్ట్ చేస్తామని భయపెడితే ప్రజలు ఎలా నమ్ముతున్నారని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయస్థానం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా వ్యాపించిన ఈ నెట్‌వర్క్‌పై సీబీఐ సమగ్ర విచారణ జరపాలని, ఏఐ టెక్నాలజీని ఉపయోగించి అక్రమ ఖాతాలను వెంటనే స్తంభింపజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు దిశానిర్దేశం చేసింది.

బీజేపీ ఆధ్వర్యంలో చలో కరీంనగర్ సన్నాక సమావేశం



స్టార్ త్రినేత్రం, వేములవాడ :

బీజేపీ ఆధ్వర్యంలో చలో కరీంనగర్ సన్నాక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటుచేసిన బిజెపి పట్టణ సమావేశంలో అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీ గురువారం కరీంనగర్లో బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగే మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ప్రతాప రామకృష్ణ గారు మాట్లాడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా విద్రోహశక్తులు చేస్తున్న ఆగడాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా 5వ తారీఖున కరీంనగర్లో జరిగే కార్యక్రమానికి యువకులు పెద్ద ఎత్తున నరేంద్ర మోడీ కి మద్దతుగా తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నూతనంగా జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన చిట్యాల రాజు ను పట్టణ బిజెపి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నేరెళ్ల సాయికుమార్ ను పట్టణ ఎండోమెంట్ కమిటీ కన్వీనర్గా ఎన్నికైన రేణు కింద అశోక్ కో కన్వీనర్ బిల్లాకృష్ణ ను శాలువా తో సత్కరించి అభినందించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణస్వామి, నాయకులు రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్ కొశీడ్లీపు ముత్యం, నాయకులు రేగుల శ్రీకాంత్, వాసశీ మల్లేశం యాదవ్,రేగుల రాజకుమార్, వివేక్ రెడ్డి, ఎడ్ల కమలాకర్, కటకం శ్రీనివాస్,చిక్కుడు మల్లేశం, చేపూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల చూపు.. ఆదిలాబాద్ వైపు..!

(మొదటిపేజీ తరువాయి)

కార్యాచరణ వంటి అంశాలను కవిత ప్రస్తావించే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరించిన కవిత, ఇప్పుడు ప్రత్యేక రాజకీయ వేదికతో ప్రజల్లోకి రావడం ఆమె రాజకీయ ప్రయాణంలో కీలక పరిణామం గా భావిస్తున్నారు. పార్టీకి గుర్తింపు తీసుకురావడం, కార్యకర్తలను సమీకరించడం, ప్రజా సమస్యలపై తన వైఖరిని స్పష్టం చేయడం ఈ సభకు ప్రాధాన్యం కల్పించనున్నాయి. సభలో కవిత చేసే ప్రసంగం, ప్రకటించే కార్యాచరణపై ఆసక్తి నెలకొంది.

రైతు సమస్యలే బీఆర్ఎస్ అస్త్రం..

మరోవైపు నవంబర్ 1న ఆదిలాబాద్‌లో జరగనున్న రైతు గర్జనకు బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇస్తోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న ఈ కార్యక్రమం ద్వారా రైతాంగ సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో వ్యవసాయం ప్రధాన జీవనాధారం కావడంతో రైతుల సమస్యలు రాజకీయంగా కీలక అంశాలుగా మారుతున్నాయి. సాగు పెట్టుబడుల భారం, పంటల దిగుబడుల పై ఆందోళనలు, పంట నష్టాలకు పరిహారం, సాగునీటి లభ్యత వంటి అంశాలు రైతాంగాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతు గర్జన ద్వారా పార్టీ శ్రేణులను సమీకరించడం, రైతులకు సంబంధించిన అంశాలపై తమ వైఖరిని వివరించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రధానంగా నిలిచే అవకాశముంది. రైతులకు ఆర్థిక భరోసా, పంట నష్టాల అంచనా, పంటల బీమా, సాగునీటి సమస్యలపై ఎలాంటి డిమాండ్లు వినిపిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. రైతుల సమస్యలను ప్రస్తావించడం తో పాటు వాటి పరిష్కారం కోసం ఎలాంటి తదుపరి కార్యాచరణ చేపడతారన్నది కూడా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

వేర్వేరు వేదికలు.. వేర్వేరు లక్ష్యాలు..

కవిత, కేటీఆర్ ఇద్దరూ ఆదిలాబాద్ జిల్లా వేదికగా ప్రజల ముందుకు వస్తున్నప్పటికీ, వారి రాజకీయ వేదికలు, కార్యక్రమాల లక్ష్యాలు వేర్వేరుగా కనిపిస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన ద్వారా తన రాజకీయ కార్యాచరణను విస్తరించుకోవడం పై కవిత దృష్టి సారిస్తుండగా, రైతు సమస్యలను కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. గతంలో ఒకే రాజకీయ పార్టీలో పనిచేసిన ఈ ఇద్దరు నాయకులు ఇప్పుడు వేర్వేరు వేదికలపై కార్యక్రమాలు నిర్వహించనుండటం సహజంగానే చర్చకు దారితీస్తోంది. అయితే ఈ రెండు సభలను నేరుగా పరస్పర రాజకీయ పోటీగా చూడటానికి బదులుగా, ఆయా నాయకులు తమ రాజకీయ లక్ష్యాలను ప్రజలకు వివరించుకునే వేదికలుగా చూడాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లాలో రైతాంగ సమస్యలతో పాటు సాగునీరు, తాగునీరు, గ్రామీణాభివృద్ధి, ఉపాధి, మౌలిక వసతులు వంటి అంశాలు ప్రజలకు కీలకంగా ఉన్నాయి. ఈ సమస్యలపై ఎవరు ఎలాంటి పరిష్కారాలను ప్రతిపాదిస్తారు? ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎలాంటి కార్యాచరణ ప్రకటిస్తారు? అన్నది కీలకంగా మారనుంది.

సభల తర్వాతే అసలు పరీక్ష..

ఇంద్రవెల్లిలో కవిత పాంచజన్య సభ, ఆదిలాబాద్‌లో కేటీఆర్ రైతు గర్జనతో జిల్లాలో రాజకీయ సందడి పెరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఆయా నాయకులకు తమ ఆలోచనలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశాన్ని కల్పించనున్నాయి. అయితే సభలకు హాజరయ్యే జనసమీకరణ ఒక్కటే ప్రజా మద్దతుకు కొలమానం కాదు. స్థానిక సమస్యలపై నాయకులు ఎంత స్పష్టంగా స్పందిస్తారు? ప్రజలకు ఉపయోగపడే అంశాలను ఎంత బలంగా ప్రస్తావిస్తారు? సభల అనంతరం ప్రకటించిన కార్యాచరణను ఎంతవరకు కొనసాగిస్తారు? అన్న అంశాలే కీలకంగా మారనున్నాయి. ఒకవైపు తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ ప్రయాణాన్ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధమవుతోంది. రెండు సభలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ చర్చలు ఊపందుకోనున్నాయి. రాజకీయ పోటీలు, వేదికలు ఎలా ఉన్నా ప్రజలు మాత్రం తమ సమస్యలకు పరిష్కారం చూపే కార్యాచరణను ఆశిస్తున్నారు. సభల వేదికగా వినిపించే మాటలు క్షేత్రస్థాయిలో పనులుగా మారుతాయా? ప్రజా సమస్యలపై నాయకులు ఎంతకాలం నిలబడతారు? అన్నదే రానున్న రోజుల్లో కీలకంగా మారనుంది.

మాధవ నగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి

రోడ్డు నంబర్లు 2, 8లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మరమ్మతులు

కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ చొరవతో సమస్యకు పరిష్కారం






స్టార్ త్రినేత్రం, ఎల్బీనగర్:

కర్మన్‌ఘాట్ డివిజన్ పరిధిలోని మాధవ నగర్ కాలనీ అభివృద్ధికి కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ నిరంతరం కృషి చేస్తున్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మాధవ నగర్ కాలనీలోని రోడ్డు నంబర్లు 2, 8లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ అస్తవ్యస్తంగా మార డంతో పాటు ఎలు కలు డ్రైనేజీ పైవులను తొలి చేయడం వల్ల మురు గునీటి ప్రవా హానికి అంతరాయం ఏర్పడుతున్న సమస్యను గోపాల్ ముదిరాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ భవ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి ముదిరాజ్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ సహకారంతో మ్యాన్‌హోల్స్‌కు ప్లాస్టరింగ్‌తో పాటు బెంచ్ వర్క్, మరమ్మతులు చేపట్టారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి గోపాల్ ముదిరాజ్ నిరంతరం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆయన చొరవపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టిన హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు మాధవ నగర్ కాలనీ తరఫున అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి అధికారులు ఇదే విధంగా సహకరించాలని కోరారు

హయత్ నగర్ లో ఘనంగా ప్రజా కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆస్పత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా కాలనీతో పాటు హయత్ నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. ప్రస్తుత కాలంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం, మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని, ముఖ్యంగా స్థానిక ప్రాంతాల్లోనే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజ లకు ఎంతో సౌకర్యంగా ఉంటుం దని పేర్కొన్నారు. ప్రజలకు అవస రమైన వైద్య సేవలను అందిస్తూ, ఆరోగ్య పరిరక్షణలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజా కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం మరింత అభివృద్ధి సాధించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదిం చాలని కళ్లెం నవజీవన్ రెడ్డి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవన్ అన్న మిత్ర బృందం సభ్యులు పాండల శ్రీధర్, బద్దం రవీందర్ రెడ్డి, బీజేపీ నాయకుకు జంజ్యు నాయక్, బాలు నాయక్ కాలనీవాసులు, పాల్గొన్నారు.

3 | వరంగల్ WARANGAL | సంపుటి : 02 VOL : 02 | సంచిక : 103 ISSUE : 103 | స్టార్ త్రినేత్రం | PRGI NO: TGTEL/2025/0143 | శుక్రవారం FRIDAY | 30-10-2026 30 - 10- 2026 | పేజీలు : 04 PAGES : 04 | వెల : 2/- PRICE : 2/-

చెన్నై నుంచి తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన జిల్లా బాలల సంరక్షణ విభాగం

20 రోజులుగా సమన్వయంతో కృషి.. బాలుడిని చూసి కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు





స్టార్ త్రినేత్రం, సిద్ధిపేట: తప్పిపోయిన బాలుడిని గుర్తించి, తమిళనాడు రాజధాని చెన్నై నుంచి సురక్షితంగా తీసుకొచ్చి కన్న తల్లిదండ్రులకు అప్పగించి జిల్లా బాలల సంరక్షణ విభాగం మానవత్వాన్ని చాటుకుంది.వర్గల్‌కు చెందిన డొక్కా శేఖర్ తప్పిపోయి చెన్నైలోని బాలల సంరక్షణ విభాగం వద్ద ఉన్నట్లు సుమారు 20 రోజుల క్రితం జిల్లా బాలల సంరక్షణ అధికారి రాముకు సమాచారం అందింది. దీంతో ఆయన వెంటనే స్పందించి, బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించేందుకు బాలల సంరక్షణ అధికారి రాజును వారి ఇంటికి పంపించారు. బాలుడు చెన్నైలో ఉన్నాడని, అక్కడికి వెళ్లి తీసుకురావాలని తల్లిదండ్రులకు వివరించారు. అయితే అంత దూరం ప్రయాణించి బాలుడిని తీసుకు రావడం తమకు సాధ్యం కాదని వారు తెలిపారు.దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము చెన్నై బాలల సంరక్షణ అధికారులతో సమన్వయం చేసుకున్నారు. వారి సహకారంతో బాలుడు డొక్కా శేఖర్‌ను ఎస్కార్ట్ ద్వారా సురక్షితంగా తీసుకొచ్చేలా చర్యలు చేపట్టారు. అనంతరం గురువారం బాలల సంక్షేమ సమితి ద్వారా బాలుడిని అతని కన్న తల్లిదండ్రులైన డొక్కా వెంకటయ్య, వైనమ్మలకు అప్పగించారు. చాలా రోజుల తర్వాత తమ కుమారుడిని చూసిన తల్లిదండ్రులు ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యారు. తమ బిడ్డను తిరిగి తీసుకురాలేమని భావించా --మని, జిల్లా బాలల సంరక్షణ విభాగం చొరవతో కుమారుడు తమ చెంతకు చేరాడని ఆనందం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, మంజుల, అంజమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజు, తమిళనాడు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

100% ఇథనాల్ వాహనాలు వస్తే సరఫరా ఎలా?: కేంద్రానికి సుప్రీం ప్రశ్న



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇస్తే.. దానికి తగిన ఇథనాల్ సరఫరాను ఎలా సాధ్యం చేస్తారని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అక్టోబర్ 26న రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ 'సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్ 1989'కి నవరణలు చేస్తూ, ఇ100 ఇంధనంతో నడిచే 'ఫ్లెక్స్-ఫ్యూయల్' వాహనాలకు అనుమతినిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే.. మరోవైపు పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే తక్షణ ప్రణాళికలేవీ లేవని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. వార్తాపత్రిక కథనాలను ప్రస్తావిస్తూ జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. న్యాయస్థానం వేసిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి సమాధానమిస్తూ.. 100 శాతం ఇథనాల్ ఇంధన సరఫరాను అందుబాటులోకి తీసుకురావాలంటే భారీ స్థాయిలో ఉత్పత్తి వ్యవస్థల్లో పునర్వ్యవస్థీకరణ అవసరమవుతుందని తెలిపారు. ఇథనాల్ ప్రాజెక్టుల వల్ల పర్యావరణ ప్రయోజనాలతో పాటు.. దేశంలో పల్లెల్లో ఉన్న సామాన్య రైతాంగాన్ని ఆర్థికంగా సాధికారులుగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోర్టు అభిప్రాయపడింది. రైతులకు సాధికారత కల్పించడం అనేది ఎవరూ పెద్దగా ప్రస్తావించని అత్యంత ముఖ్యమైన విషయమని, ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇథనాల్ ప్రోత్సాహం వల్ల రైతులకు ఏదో ఒక రూపంలో మేలు జరుగుతుందని, ప్రభుత్వం రూపొందించిన విధానాల్లో రైతు ప్రయోజనాలను కూడా పొందుపరిచారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇథనాల్ సరఫరా సంవత్సరం (జూన్) 2025-26 కేటాయింపులకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. కర్ణాటక హైకోర్టు ఇథనాల్ కేటాయింపులను పెంచాలని ఇచ్చిన ఉత్తర్వులపై దాఖలైన అపీలును విచారిస్తూ కోర్టు గతంలో స్టేటస్ కో విధించింది. ఇథనాల్ ఆధారిత పరిశ్రమలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను సుప్రీంకోర్టు వచ్చే నెలకు వాయిదా వేసింది.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి 3.94 కోట్లు మంజూరు

హర్షం వ్యక్తం చేసిన చైర్మన్ రొండి రాజు, డైరెక్టర్స్

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతోనే నిధుల విడుదల: వేములవాడ ఏఎంసీ చైర్మన్

మర్రిపల్లి వద్ద 12 ఎకరాల్లో మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణం

వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో పనులు -రొండి రాజు



స్టార్ త్రినేత్రం, వేములవాడ :

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ?3.94 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం మార్కెట్ కమిటీకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూస్థానికశాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితోనే ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు స్థలం అవసరమని తెలపగానే, ఎమ్మెల్యే సూచనతో జిల్లా కలెక్టర్ స్పందించి 12 ఎకరాల భూమిని కేటాయించారని చెప్పారు. ఆ స్థలంలో ఏఎంసీ భవనం, కార్యదర్శి భవనం, నూతన మార్కెట్ యార్డ్ నిర్మాణానికి సంబంధించి దాదాపు రూ.7 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి సమర్పించగా, ప్రభుత్వం రూ.3.94 కోట్లను విడుదల చేసిందని వివరించారు. మంజూరైన ఈ నిధులతో మర్రిపల్లి నూతన మార్కెట్ యార్డ్‌తో పాటు వేములవాడ యార్డ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం 11 రకాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చిందని చైర్మన్ తెలిపారు. మర్రిపల్లి మార్కెట్ యార్డ్‌లో జంగిల్ క్లియరెన్స్, మైదానం సమం చేయడం, చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఆర్ఓ ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా,పురుషులు-మహిళలకు శౌచాలయాలు, ఆర్ అండ్ బి రోడ్డు నుండి అప్రోచ్ రోడ్డు, విద్యుదీకరణ పనులు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనితో పాటు వేములవాడ మార్కెట్ యార్డ్‌లోని కవర్డ్ షెడ్‌ను 20 నూతన వ్యాపార గదులుగా మార్చే పనులు కూడా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను విక్రయించుకోవడానికి మార్కెట్ యార్డ్‌లో అన్ని రకాలసౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకితీసుకువస్తామని స్పష్టం చేశారు.?వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మోడల్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో దాదాపు రూ.1,000 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని రొండి రాజు కొనియాడారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధికి రూ.250 కోట్లు, ఆలయానికి చేరుకునే 80 ఫీట్ల విస్తరణ రోడ్డు నిర్మాణానికి రూ.46 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు వేగవంతంచేస్తున్నామని వెల్లడించారు. రైతాంగ సంక్షేమం, మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శ్రమించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు మార్కెట్ కమిటీ పాలకవర్గం, డైరెక్టర్లు మరియు నియోజకవర్గ రైతుల తరఫున ప్రత్యేకకృతజ్ఞతలుతెలియజేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సరోజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ డైరెక్టర్లు దైత కుమార్, ఖమ్మం గణేష్, గుర్రం విద్యాసాగర్, మ్యాక స్రవంతి హరి నందన్ రెడ్డి, కత్తి కనకయ్య, వస్తాద్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఢిల్లీకి తరలివెళ్దాం: రేవంత్ రెడ్డి

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :



ఓటు హక్కు చోరీకి గురైతే మిగతా హక్కులన్నీ ప్రమాదంలో పడట్టేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశ ప్రజలంతా ముందుకు రావాలని రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుకు తాను మద్దతు తెలుపుతున్నానన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి పోస్టు చేశారు. రాహుల్ గాంధీకి మద్దతుగా తాను ఢిల్లీలో ఉంటానని యావత్ తెలంగాణ సైతం రాహుల్‌కు అండగా నిలుస్తుందన్నారు. ఇది ఒక్క పార్టీ పోరాటం కాదని భారతదేశ పోరాటం అన్నారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, మన గొంతును వినిపించే హక్కును, మన ఉనికిని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాట అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గొంతెత్తాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ఢిల్లీకి తరలివెళ్దామని పిలుపునిచ్చారు. కాగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వేదికగా చేపడుతున్న చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ తీరుపై అసంతృప్తితో ఉన్నవారంతా, ప్రజాస్వామ్య ప్రేమికులంతా ఈ నిరసనలో పాల్గొనాలని కోరారు.

పీఎం దీపావళి గిఫ్ట్ రూ.8 వేలు.. వాట్సాప్‌లో లింక్ : క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ

వాట్సాప్‌లో మోసగాళ్ల సరికొత్త ఎర



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

పండుగ పూట సామాన్యుల ఆశలను ఆసరాగా చేసుకుని వారి బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు సరికొత్త కుట్రకు తెరలేపారు. భారత ప్రభుత్వం దేశ పౌరులందరికీ దీపావళి కానుకగా రూ.8,000 నగదును ఉచితంగా అందిస్తోందంటూ వాట్సాప్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఓ నకిలీ సందేశంపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలను హెచ్చరించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరును దుర్వినియోగం చేస్తూ, అధికారిక ప్రభుత్వ పథకంలా భ్రమింపజేసేలా రూపొందించిన ఈ సందేశం పూర్తిగా మోసపూరితమైనదని బ్యూరో డైరెక్టర్, సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్ స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు పండుగ వాతావరణాన్ని క్యాష్ చేసుకునేందుకు వాట్సాప్‌లో ఒక ఆకర్షణీయమైన మెసేజ్ పంపుతున్నారు. అందులో కేంద్ర ప్రభుత్వం భారతీయులందరికీ దీపావళి ఆర్థిక సాయం కింద రూ.8,000 ఇస్తోందని, ఆ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవడానికి కింద ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేయాలని ఊరిస్తున్నారు. ఆ లింక్‌ను క్లిక్ చేయగానే అది నకిలీ వెబ్‌సైట్‌కు దారితీస్తుంది. అక్కడ వ్యక్తిగత వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు, యూపీఐ పిన్ లేదా ఓటీపీలను నమోదు చేయాలని అడుగుతారు. ఒకవేళ ఆ వివరాలు నమోదు చేస్తే క్షణాల్లో బ్యాంకు ఖాతాలోని సొమ్మంతా నేరగాళ్ల జేబుల్లోకి వెళ్లిపోతుంది. అంతేకాకుండా.. ఆ లింక్ క్లిక్ చేయడం వల్ల మొబైల్ ఫోన్లలోకి హానికరమైన మాల్వేర్ లేదా వైరస్ చొరబడి ఫోన్ నియంత్రణ సైబర్ ముఠాల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని డైరెక్టర్ వివరించారు.ప్రభుత్వం ఎలాంటి నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారిక పోర్టళ్లు, గుర్తింపు పొందిన వార్తా ఛానెళ్ల ద్వారానే ప్రకటిస్తుందని, ఇలాంటి ప్రైవేట్ వాట్సాప్ లింకుల ద్వారా కాదని శిఖా గోయల్ స్పష్టం చేశారు. ఎవరూ కూడా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, ఇతరులకు ఫార్వర్డ్ చేసి వారిని కూడా మోసాల ఊబిలోకి నెట్టవద్దని కోరారు.

హైదరాబాద్‌లో నీటి వృథాకు చెక్.. 'పానీ' యాప్ ప్రారంభించిన మంత్రి పొన్నం

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :



భాగ్యనగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రూపొందించిన 'పానీ' యాప్‌ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. తాగునీటి సంరక్షణ కోసం హైదరాబాద్ జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు నగర పౌరులను భాగస్వాములను చేస్తూ 'పానీ' పేరుతో యాప్‌ను సిద్ధం చేసింది. దీనిని గురువారం జలమండలి కార్యాలయంలో మంత్రి పొన్నం, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకే 'పానీ' యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. కేవలం జలమండలి అధికారులు, సిబ్బంది ద్వారానే అన్ని ప్రాంతాల్లో నీటి సంరక్షణ సాధ్యం కాదని పేర్కొన్నారు. అందుకే ప్రజలనూ భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. నీటి సంరక్షణపై ఆసక్తి ఉన్న ప్రతి పౌరుడు ఇందులో 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ యాప్‌లో ప్రతి పౌరుడు నమోదు చేసుకుని, వాలంటీర్‌గా ఫిర్యాదు చేయాలని పొన్నం సూచించారు. మరోవైపు, మహా నగరంలో భారీ వర్షాలు పడినప్పుడు నీటిని సంరక్షించడంపై ప్రజలు తగిన శ్రద్ధ చూపడం లేదని మంత్రి పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంచాల్సిన అవసరం ఉందని, ఈ బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందుకు ప్రతి ఇంటి ఆవరణలోనూ ఇంకుడుగుంత ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని పిలుపునిచ్చారు. నగర ప్రజలపై జరిమానాలు విధించడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, నీటి పొదుపుపై అవగాహన కల్పించడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

త్రివిక్రమ్‌లో ఈ మార్పు ఏంటి.. ఈసారి ఆ పరిస్థితులకు నో!




వెంకటేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఆదర్శ కుటుంబం. ఈ సినిమా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలుగు సినిమా ఇండస్ట్రీలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన రాసే డైలాగ్స్, కథను చెప్పే విధానం, కుటుంబ భావోద్వేగాలను తెరపై చూపించే తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. అయితే త్రివిక్రమ్ సినిమాల విషయంలో అప్పుడప్పుడు కథల గురించి కొన్ని చర్చలు కూడా జరుగుతుంటాయి. ముఖ్యంగా ఆయన కొన్ని సినిమాలు పాత సినిమాల కథలను పోలి ఉన్నాయనే అభిప్రాయాలు గతంలో వినిపించాయి. ఇప్పుడు మాత్రం త్రివిక్రమ్ ఒక రచయితకు ఇచ్చిన క్రెడిట్ ఆసక్తికరంగా మారింది. వెంకటేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఆదర్శ కుటుంబం. ఈ సినిమా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసిన ప్రసంగం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా ఈ సినిమా కథకు ప్రత్యేకమైన సలహాలు అందించిన రచయిత, దర్శకుడు కన్నన్ డీఎస్‌ను.. ఆయన ప్రత్యేకంగా అభినందించారు. దీంతో త్రివిక్రమ్ ఈ సినిమాకు సంబంధించి ఏం చేశారు..ఆయన పాత్ర ఎంతవరకు ఉంది..అనే ప్రశ్నలు మొదలయ్యాయి. గతంలో త్రివిక్రమ్ సినిమాల విషయంలో కొన్ని కాంట్రవర్సీలు జరిగాయి. ముఖ్యంగా ఆయన దర్శకత్వంలో వచ్చిన అ ఆ సినిమా కథ పాత సినిమా మీనాను పోలి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలా కథ తీసుకోవడం తప్పుకాక పోయిన రచయితకు ప్రదీప్ ఇవ్వటం చాలా ముఖ్యం అని అప్పట్లో కామెంట్లు పెట్టారు. ఇప్పుడు ఆదర్శ కుటుంబం' సినిమా విషయంలో మాత్రం త్రివిక్రమ్ కన్నన్ డీఎస్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించడం ఆసక్తిని పెంచింది. ఒక కథకు మరో రచయిత అందించిన సహకారాన్ని గుర్తించి, వేదికపై ఆయనను ప్రశంసించడం మంచి పరిణామంగా చూడవచ్చు. మరోవైపు త్రివిక్రమ్ సినిమాలంటే ప్రేక్షకులు ఆయన మార్క్ డైలాగ్స్‌ను ప్రత్యేకంగా ఆశిస్తారు. అందుకే 'ఆదర్శ కుటుంబం'లో కూడా ఆయన శైలిలో ఉండే మాటలు ఉంటాయా.. అన్న ఆసక్తి నెలకొంది. వెంకటేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్, బ్రహ్మాజీ, సత్య తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 30న సినిమా విడుదలకు సిద్ధమవుతోంది.

రావణుడిపై సాయి పల్లవి కామెంట్స్.. నెట్టింట తెగ ట్రోలింగ్..!



బాలీవుడ్ చిత్రం 'రామాయణ'లో సీతగా నటిస్తున్న సాయి పల్లవి, తాజాగా ఓ ఇంటర్వ్యూలో "రావణుడు పూర్తిగా చెడ్డవాడు కాదు, మనలోని రావణుడిని కూడా గుర్తించి మార్చుకోవాలి" అని చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. దీంతో సినిమా విడుదలకు ముందే ఎందుకిలాంటి వివాదాస్పద వ్యాఖ్యలంటూ కొందరు నెటిజన్లు ఆమెపై తీవ్ర విమర్శలు గుప్పించారు.అయితే, సాయి వల్లవికి మద్దతుగా నిలిచిన మరికొందరు అభిమానులు.. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న యశ్ పాత్ర గురించో లేదా ధార్మిక వేత్తలు చెప్పే సాధారణ విషయాల గురించో ఆమె మాట్లాడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం ఒక చిన్న క్లిప్పింగ్ చూసి నెగెటివిటీని ప్రచారం చేయడం సరికాదని, పూర్తి ఇంటర్వ్యూ చూస్తేనే అసలు విషయం అర్థమవుతుందని స్పష్టం చేస్తున్నారు.



పెద్ద సినిమాల రిస్క్ వద్దు.. 'రియాలిటీ'తో సేఫ్ రికవరీ సాధ్యమేనా?

ఇప్పుడు టాలీవుడ్‌లో యంగ్ హీరోలు నటనతో పాటు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలోనూ తమ ప్రతిభను చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు టాలీవుడ్‌లో యంగ్ హీరోలు నటనతో పాటు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలోనూ తమ ప్రతిభను చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. అడవి శేషు ,నాని, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి హీరోలు కూడా తమ సినిమాల విషయం లో చురుగ్గా పాల్గొన్నారు. ఇప్పుడు కిరణ్ అబ్బవరం కూడా ఈ జాబితాలో చేరారు. త్వరలో విడుదల కానున్న 'రియాలిటీ' సినిమాకు ఆయన దర్శకత్వం వహిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. ఆ విశేషాలు చూద్దాం.. హీరోల దర్శకత్వ బాధ్యతలు.. ప్లస్సెస్ అండ్ మైనస్సెస్:ఒక నటుడు తెరపై కనిపిస్తూనే, వెనుక ఉండి దర్శకత్వం పర్యవేక్షించడం కత్తి మీద సాము లాంటిదే. విశ్వక్ సేన్ వంటి కొందరు నటులు ఈ సాహసం చేసి సక్సెస్ కొంత సాధించారు. అయితే, నటనతో పాటు డైరెక్షన్ బాధ్యతలు కూడా మోయడం కొన్నిసార్లు సినిమా ఫలితంపై ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదు. అడవిశేషు, నాని, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు కేవలం క్రియేటివ్ పనులకే పరిమితమవగా.. కిరణ్ అబ్బవరం మాత్రం ఏకంగా డైరెక్షన్‌లోకి అడుగుపెట్టడం విశేషం. 'రియాలిటీ' చిత్రంతో కిరణ్ రోల్: గతంలో తన సినిమాలతో మంచి విజయాలు అందుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు 'రియాలిటీ' సినిమా ద్వారా సరికొత్త సవాల్‌ను స్వీకరించారు. ఈ చిత్రానికి కథ అందించడంతో పాటు, లీడ్ రోల్ పోషిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్నారు. ఇక నటుడిగా, దర్శకుడిగా ఆయన చేస్తున్న ఈ తొలి ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. క్రిస్మస్ బరిలో స్మార్ట్ బిజినెస్ వ్యూహం: ఈ క్రిస్మస్ పండుగ సీజన్‌లో సీనియర్ హీరోలైన నాగార్జున 100 సినిమా, బాలకృష్ణ 'దాదా' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు పోటీలో ఉన్నాయి. ఈ ఉద్ధండుల మధ్యే కిరణ్ అబ్బవరం 'రియాలిటీ' సినిమా కూడా విడుదలవుతుండటం గమనార్హం. ఇక పెద్ద సినిమాల



జోరు ఉన్నప్పటికీ, ఈ చిత్రం తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కుతుండటంతో ట్రేడ్ వర్గాల్లో దీనికి మంచి డిమాండ్ ఉంది. బిజినెస్ పరంగా చూస్తే రిస్క్ చాలా తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో, దాదాపు రూ. 16 కోట్ల థియేట్రికల్ రైట్స్ కోసం నలుగురు ప్రముఖ డిస్ట్రిబ్యూటర్లు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇక మొత్తంగా చూస్తే, నటుడిగా తన మార్కెట్‌ను స్థిరపరుచుకుంటూనే.. దర్శకుడిగా అడుగుపెడుతున్న కిరణ్ అబ్బవరం ప్రయత్నం విజయవంతమైతే ఆయన కెరీర్‌కు ఇది టర్నింగ్ పాయింట్ అవుతుంది. ఇక క్రిస్మస్ పండగ కానుకగా రానున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వన్దర్స్ క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

పెద్ది సినిమా వివాదం.. జాన్వీ కపూర్ కీలక నిర్ణయం.. ఇక ఆ సినిమా చేయనంటూ షాక్!

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా పెద్ది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా పెద్ది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ



సినిమా విషయంలో గతంలో ఆమె పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై జాన్వీ స్పందించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తన తప్పును అంగీకరిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. జాన్వీ కపూర్ ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినిమాల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది. తెలుగులో ఇప్పటికే దేవర సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఆమె.. ఆ తర్వాత పెద్ది చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే... అయితే సినిమాలో ఆమె పాత్రను చూపించే విధానంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తాజాగా బాలీవుడ్ టాక్ షో కాఫీ విత్ కరణ్‌లో ఈ వివాదం గురించి జాన్వీ మాట్లాడారు. సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో తాను మరింత జాగ్రత్తగా ఉండాల్సిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక నటిగా తనకూ బాధ్యత ఉందని, ఏదైనా సన్నివేశం అభ్యంతరకరంగా అనిపిస్తే దానిపై మాట్లాడాల్సిందని ఆమె చెప్పుకొచ్చారు. ఇతరులను నిందించడం కంటే తనవంతుగా ఏం చేయాల్సిందో ఆలోచించడం ముఖ్యమని జాన్వీ తెలిపారు. ఇదిలా ఉంటే, ఫిఫ్టీ షేడ్స్ ఆఫ్ గ్రే సినిమాకు దేశీ వెర్షన్ తీస్తే అందులో ఏ హీరోతో నటిస్తారని జాన్వీని అడిగినప్పుడు, పెద్ది సినిమా అనుభవం తర్వాత అలాంటి సినిమా చేయనని ఆమె చెప్పక వచ్చారు. ఒక సినిమాలో తప్పు ఉంది అంటే అది దర్శకుడు అలానే హీరోయిన్ ఇద్దరి పైన ప్రభావం ఉంటుంది. ఈ క్రమంలో జాహ్నవి తన తప్పు ఒప్పుకొని ఇలా మాట్లాడటం.. చాలామందికి పాజిటివ్గా అనిపించింది. ఒక హీరోయిన్ తన తప్పు ఒప్పుకోవడం చాలా మంచి విషయమని అందరూ కామెంట్లు పెడుతున్నారు. మరి భవిష్యత్తులో జాన్వి ఇలాంటి సినిమాలు కాకుండా మంచి స్క్రిప్టులు ఎంచుకొని తెలుగులో మంచి పేరు తెచ్చుకుంటుందేమో వేచి చూడాలి.

కత్రినను అందుకే దేవతాసుందరిగా ఆరాధిస్తారు!

ఈ కవర్ షూట్‌లో కత్రిన ఫ్యాషన్ సెన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంది. రాయల్ వైట్ అండ్ సిల్వర్ ఎత్నిక్ వేర్‌కి ఆభరణాల ఎంపిక ఎంతో రీచ్‌గా ఉంది.కత్రిన కైఫ్‌ను అభిమానులు ఎందుకు దేవతాసుందరిగా, టైమ్‌లెస్ బ్యూటీగా ఆరాధిస్తారో మరోసారి రుజువు చేసింది ఈ తాజా –వోగ్ ఇండియా– కవర్ షూట్. అభూ జానీ సందీప్ ఖోస్లా డిజైనర్ డ్రెస్.. దానికి తగ్గట్టుగా అమర్చిన పార ట్రెడిషనల్ వెూడరన్ కాంబినేషన్ జ్యూవెలరీలో ఈ బ్యూటీ రాచరికపు కన్నె సిరిలా మెరిసిపోయింది. దశాబ్దాలు గడుస్తున్నా తన గ్లామర్, డిగ్నిటీ, ప్లాటినం బాడీ లాంగ్వేజ్ ద్వారా ఫ్యాషన్ ప్రపంచంలో క్యూట్ ఐకానిక్ స్టాండర్డ్స్‌ను కంటిన్యూ చేస్తోంది. ఈ వోగ్ కవర్ పేజీలో కత్రిన ప్రదర్శించిన ఎలిగెన్స్, డివైన్ ప్రెజెన్స్ తన ప్రతిష్టను మరింత పెంచాయి. 'రియాలిటీ'తో సేఫ్ రికవరీ సాధ్యమేనా? ఈ కవర్ షూట్‌లో కత్రిన ఫ్యాషన్ సెన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంది. రాయల్ వైట్ అండ్ సిల్వర్ ఎత్నిక్ వేర్‌కి ఆభరణాల ఎంపిక ఎంతో రీచ్‌గా ఉంది. ఎంపిక చేసుకున్న ఇయర్ రింగ్స్, సిల్వర్ గాజులు క్లాసిక్ స్టైల్ క పూర్తి రూపానిచ్చాయి. మినిమల్ మేకప్, నాచురల్ హెయిర్‌స్టైలింగ్ ద్వారా --అందం అనేది కష్టపడి సాధించేది మాత్రమే కాదు.. మనసులో నుంచి పొంగిపొర్లే సహజమైన ఆనందం-- అనే విషయాన్ని స్పష్టంగా చాటిచెప్పారు. గడిచిన



కొద్దికాలంలో కత్రిన వ్యక్తిగత జీవితంలో విక్కీ కౌశల్‌తో వైవాహిక బంధం.. అలాగే తల్లిగా బాధ్యతల్లో వచ్చిన మార్పులు తనలో ఒక కొత్త పరిపక్వతను, మానసిక శాంతిని నింపాయి. –మామ్– అయ్యాక కత్రిన ముఖంలో ఒక ప్రత్యేకమైన ప్రశాంతత, పరిపూర్ణత స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌ను పాటిస్తూనే.. కేవలం గ్లామరస్ రోల్స్ మాత్రమే కాకుండా తన ఆలోచనా విధానానికి తగ్గట్టుగా వైవిధ్యమైన పాత్రలను మాత్రమే ఎంచుకునే ధోరణి ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం కత్రిన కేవలం నటనకే పరిమితం కాకుండా తన సొంత బ్యూటీ బ్రాం డ్ –కేబ్యూటీ– బిజినెస్‌ను విస్తరించడంపైనా.. ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌లపైనా దృష్టి పెట్టారు. –మెర్రీ క్రిస్మస్–, –టైగర్ 3– సినిమాలతో మెప్పించిన తర్వాత ఈ ఏడాది కంటెంట్ ఆధారిత చిత్రాల్లో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఫర్హాన్ అక్తర్ కాంబినేషన్‌లో అనుకున్న భారీ ప్రాజెక్ట్‌తో పాటు పలు ఆసక్తికరమైన కథలు చర్చల దశలో ఉన్నాయి. మల్లీశ్వరిగా తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్న కత్రిన.. ఏజ్ లెస్ బ్యూటీగా వెలుగొందుతో ంది. మామ్ అయ్యాక రూపం మారిపోయిందని కొన్ని కామెంట్లు విని పించినా.. తిరిగి కంబ్యాక్ ఎలా ఉంటుందో చూపిస్తోంది. ఫిట్నెస్ ఫ్రీక్ గా తన గ్లామర్ కించిత్ చెదరదని నిరూపిస్తోంది. ఎంతమంది కొ త్త కథా నాయికలు వచ్చినా.. తనదైన ప్రత్యేక శైలితో –దేవతాసుం దరి –గా తన స్థానాన్ని కత్రిన ఎప్పటికీ చెక్కుచెదరకుండా కాపాడుకుంటోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com